




## "నా దేశంలో ఓ మూల"



అక్కడో గూడెం వుంది. ఉండముట్టే విసిరేసిన చిత్తుకాగితంలా ఝుయ్‌మంటూ వీసిన గాలికి రయ్‌మంటూ ఎగిరి వచ్చాయి గుడిసెల మీది ఆకులన్నీ ఎండి పోయిన చెట్టు నుంచి రాలిపడిన ఆకుల్లా.

అక్కడి మనుషులంతా ఎముకల గూడుపై తోలుగుడ్డను కప్పుకుని పీలిక లైన బట్టలతో పీచుపీచు మంటున్నారు. శ్మశానంలో సంచరిస్తూ కీచుకీచుమని అరిచే పిశాచాల్లా.

బక్క చిక్కిన వారి డొక్కలు ముడ తలు పడి గీతల్లా కనిపిస్తున్నాయి. అనా వృష్టి కారణంగా ఎండిపోయి బీటలు వారిన బీడునేలలా.

ఆ ప్రాంతంలో ఉండుండి వినిపిస్తు న్నాయి ఆకలి కేకలు వందకాకులు కలసి ఒక్కసారి అరచినట్లుగా.

ఎండిన రొమ్మును పట్టి ఎంత పీల్చినా గుక్కెడైనా రాని పాల కోసం గుండెలవిసేలా అల్లాడుతున్నారు పసి పిల్లలు ఒడ్డున పడి గిజగిజ తన్నుకుం టున్న చేపల్లా.

కొత్త ఊహ తెలిసిన పిల్లలు మాత్రం ఊరివీధుల్లో తినిపారేసిన ఎంగిలాకులపై పడి కుమ్ముకుంటున్నారు. కుళ్ళిపోయిన చెత్తపై ముసురుకునే ఈగల్లా.

కూలికెళ్ళా పని లేక, కూడొండను గింజలేక- అక్కడి ఆడా మగా, ముసలీ ముతకా అస్థిపంజరాల్లాంటి శరీరాలను గుడిసెల కానించి కూర్చుని వున్నారు గోతుకాడి నక్కల్లా.

తినటానికి లేకపోతే పోయే, కనీసం తాగడానికైనా నీళ్ళు లేవు. కన్నీళ్ళయినా తాగి కడుపు నింపుకుందామంటే కరడు కట్టిన హృదయాల్లో అవి ఎప్పుడో ఇంకి పోయాయి మండు ఎండలకు ఆవిరయిన నీటి వాగుల్లా.

నిత్యం ఆకలి రాజ్యమేలుతుందక్కడ ప్రతి పక్షాల్లేని ప్రధాన పార్టీల్లా.

అను దినం వారిని దారిద్ర్యదేవత కాపలా కాస్తూంటుంది ఛీ! అని ఛీదరిం చినా తోకాడించుకుంటూ వెంటపడే కుక్కలా.

మృత్యు నీడే వారికి కొండంత అండగా నిలుస్తుంది.

వారానికో సారైనా శ్మశానం వారిని ఆహ్వానిస్తుంటుంది.

నలభై నిళ్ళ స్వాతంత్ర్యం వారి జీవిత గతిని ఏమాత్రం మార్చలేక పోయినా వారి బతుకుల్లో మాత్రం ఇంకా ఏదో ఆశమిగిలే వుంది ఎన్నికల ఫలితాల్లో ఏమాత్రం మెజారిటీ లేక పోయినా ఆఖరి క్షణంలో నైనా తానే గెలుస్తానను కునే అభ్యర్థి మనసులా.

—మంతెన విజయలక్ష్మి

## నొప్పినీ, బాధనూ పోగొట్టే పంపు



రోగుల నొప్పులను తక్షణమే నివారించే పంపునొక దానిని ఇటీవలే ఆస్ట్రేలియాకు చెందిన డాక్టర్ స్టాం ఎంవెర్‌జర్ కను గొన్నాడు-

రోగికి ఆపరేషన్ జరిగిన తరువాత కలిగే తీవ్ర బాధను తొలగించడానికి ఈ పంపు ఎంతగానో ఉపయోగపడుతుందని డాక్టర్లు నిర్ధారించారు. అంతేకాదు, ప్రసవం ముందు మహిళలకు వచ్చే నొప్పులను కూడా ఈ పంపు నివారిస్తుంది. తనంతకు తానే పనిచేసే ఈ పంపు నొప్పి కలుగుతున్న ప్రాంతాల్లోకి మందులను పంపిస్తుంది. అలా నొప్పిని లేకుండా చేస్తుంది.

ఇప్పుడు ఈ పంపును ఆస్ట్రేలియాలోని సెంట్ విసెంట్ ఆస్పత్రిలో వాడుతున్నారు. త్వరలోనే ఇది మార్కెట్‌లోకి రాబోతున్న దంటున్నారు.

—ఎ.పి. నాథ్